సాక్షి
నిజామాబాద్
సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



ఎండాకాలం జరపైలం

వేసవిలో రోడ్డుపై ప్రయాణించేటప్పుడు వేడికి వాహనాల టైర్లు పేలి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

- 8లో ▸



అక్రమంగా మట్టి తరలింపు

అనుమతి లేకుండా చెరువులో నుంచి నల్లమట్టిని ఇటుక బట్టీలకు అక్రమంగా తరలిస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.3 /22.5

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఈదురుగాలులు వీస్తాయి. అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముగిసిన గురుకుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ, తెలంగాణ గురుకుల(టీఎస్‌ఆర్‌ఎస్‌) పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష వీటీజీసెట్‌ ప్రశాంతంగా జరిగినట్లు ఆర్‌సీవో మేరీ యేసుపాదం, డీసీవో సంగీత తెలిపారు. నిజామాబాద్‌ రీజినల్‌ పరిధిలోని నిజామాబాద్‌ జిల్లాలో 17, కామారెడ్డి జిల్లాలో 10, నిర్మల్‌ జిల్లాలో 16, మొత్తం 43 పరీక్షా కేంద్రాల్లో కోవిడ్‌–19 జాగ్రత్తలతో ఉమ్మడి ప్రవేశ నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. మొత్తం 15,363 మంది అభ్యర్థులకు గాను 14,476 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు ఆర్‌సీవో, డీసీవోలు తెలిపారు.

కేంద్ర హోంమంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్‌



సుభాష్‌నగర్‌: చేవెళ్లలో ఆదివారం సాయంత్రం జరిగిన విజయ సంకల్ప సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌ షాకు శంషాబాద్‌ ఎయిర్‌పోర్టులో నిజామాబాద్‌ ఎంపీ అర్వింద్‌ ధర్మపురి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువ కప్పి సన్మానించారు.

కేసీఆర్‌కు దళితులపై చిత్తశుద్ధి లేదు




సుభాష్‌నగర్‌: రాష్ట్రంలోని దళితులపై సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదని, వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్‌ సూర్యనారాయణ ఆరోపించారు. ఆదివారం అంబేడ్కర్‌ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని దళిత మోర్చా ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీతోనే అంబేడ్కర్‌ కలలుగన్న సమాజ అభ్యుదయం సాధ్యమవుతుందని తెలిపారు. అంబేడ్కర్‌ పుట్టి, పెరిగి, నివసించిన, చదువుకున్న ప్రాంతాలను పంచ తీర్థాలుగా బీజేపీ ప్రభుత్వం గుర్తించిందన్నారు. దళితులకు మూడెకరాల భూమి, పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి మొదటి సీఎం దళితుడని కేసీఆర్‌ హామీనిచ్చి మోసం చేశారని విమర్శించారు. అంబేద్కర్‌ రూపొందించిన రాజ్యాంగాన్ని తిరిగి రాస్తానని సీఎం కేసీఆర్‌ దేశ ప్రజలను అవమానించారని, బీఆర్‌ఎస్‌కు దళితులు సరైన సమయంలో గుణపాఠం చెప్తారని తెలిపారు. కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్‌ శివప్రసాద్‌, నాయకులు ప్రతాప్‌, సందీప్‌, రాహుల్‌, శీల శ్రీనివాస్‌, సంజీవ్‌, రవి, బాలకృష్ణ, నరేశ్‌ పాల్గొన్నారు.

ఒకరికి పాజిటివ్‌

నిజామాబాద్‌ సిటీ : జిల్లాలో ఆదివారం నిర్వహించిన కరోనా పరీక్షల్లో ఒకరికి పాజిటివ్‌ వచ్చిందని డీఎంహెచ్‌వో సుదర్శనం తెలిపారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా మొత్తం 46 మందికి కరోనా పరీక్షలు చేయగా ఒకరికి పాజిటివ్‌గా తేలిందన్నారు. వారంరోజుల్లో మొత్తం 11 కరోనా కేసులు వెలుగు చూశాయి.

మంజీరలో పుష్కర స్నానాలు



నాగిరెడ్డిపేట: గోలిలింగాల గ్రామశివారులోని మంజీర నదికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. పుష్కర స్నానాలు ఆచరించారు. మదనానంద సరస్వతి స్వామీజీ పుష్కర స్నానం ఆచరించి, నది ఒడ్డున గల శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఎవరీ శుశ్రుత్‌ రెడ్డి?

- వర్సిటీతో సంబంధం లేని వ్యక్తికి ఏడాదికి పైగా డబ్బుల చెల్లింపు
- వీసీ పీఏలకూ రూ. 6 లక్షలకు పైగా అడ్వాన్సులు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో వర్సిటీ ఉన్నతాధికారుల అక్రమాలు మరిన్ని వెలుగులోకి వచ్చాయి. యూనివర్సిటీకి ఎలాంటి సంబంధం లేని, అసలు ఎవరూ ఇప్పటి వరకు చూడని శుశ్రుత్‌ రెడ్డి అనే వ్యక్తి పేరిట రూ. 3,18,500లు చెల్లింపులు జరిగినట్లు తెలిసింది. 2022 జనవరి నుంచి జూలై 2022 వరకు 6 నెలల కాలానికి సంబంధించి ఏరియర్స్‌ పేరిట అతడికి రూ. 1,59,250లు చెల్లించారు. అలాగే 2022 ఆగస్టు నుంచి 2023 మార్చి వరకు ప్రతి నెలా వేతనం పేరుతో రూ. 22,750లు చొప్పున(ఎస్‌బీఐ ఖాతాలో) చెల్లించారు. మనిషి ఎవరో తెలియదు.. ఏ విభాగంలో పనిచేస్తాడో తెలియదు.. ఎలాంటి ఆర్డర్‌ లేదు.. అయితే చెక్కులు ఎలా రాశారు, వాటిపై రిజిస్ట్రార్‌ ఎలా సంతకం చేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆ బ్యాంకు ఖాతాలో వేసిన డబ్బులను వీసీ యే విత్‌డ్రా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వీసీ పీఏలకూ..

తెయూ వీసీ ప్రొఫెసర్‌ డి.రవీందర్‌ వద్ద పీఏలుగా పనిచేసిన నలుగురు(అవుట్‌ సోర్సింగ్‌ సిబ్బంది) 2021 నవంబర్‌ తర్వాత అడ్వాన్స్‌ పేరిట రూ. 6లక్షల 60వేల వరకు తీసుకున్నారు. వీరిలో అత్యధికంగా డి.సవిత రూ. 3,79,500లు, జె.నవ్య రూ. 2లక్షలు, కె.ఉదయ్‌ రూ. 41వేలు, బి.సురేష్‌ రూ. 38వేలు తీసుకున్నారు. నిబంధనల ప్రకారం అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బులను వేతనం నుంచి వసూలు చేయాలి. లేదంటే మార్చి నెలాఖరులోగా సెటిల్‌ చేయాల్సి ఉంటుందని వర్సిటీ వర్గాలు తెలిపాయి. అయితే అడ్వాన్స్‌ పేరిట డబ్బులు తీసుకుని ఏడాదిన్నరకు పైగా గడిచినా ఇంతవరకు ఎవరూ చెల్లించకపోవడంపై వర్సిటీ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అవుట్‌ సోర్సింగ్‌ సిబ్బంది ఏజేన్సీ ద్వారా వర్సిటీలో పని చేస్తుంటారు. వారికి ఇంతపెద్ద మొత్తంలో అడ్వాన్స్‌లు ఎలా ఇచ్చారనే విషయం అర్థం కావడం లేదు. అయితే పీఏలు అడ్వాన్స్‌ పేరిట తీసుకున్న డబ్బులను కూడా వారి వద్ద నుంచి వీసీ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంకా డెయిలీ వేజ్‌ పేరిట నియమించిన 147 మంది సిబ్బందికి మూడు నెలల కాలంలో లక్షల రూపాయలు వేతనంగా చెల్లించినట్లు తెలుస్తోంది. వారికి ఎంత మొత్తం చెల్లించారనే విషయమై నూతన రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ యాదగిరి ఆయా విభాగాల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. అలాగే 23 మంది అవుట్‌సోర్సింగ్‌ సిబ్బందికి అక్రమంగా పదోన్నతులు ఇచ్చి ఏరియర్స్‌ పేరిట డబ్బులు చెల్లించారు. కొందరికి పదోన్నతులు ఇవ్వకుండానే వేతనం పెంచారు. వీటన్నింటిపై ఈసీ సమావేశంలో నిర్ణయించిన ఐదుగురు సభ్యుల కమిటీ వీలైనంత త్వరగా విచారణ జరిపి అక్రమాలు వెలికితీయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

బడ్జెట్‌కు ఈసీ ఆమోదం లేదు

2022–23 వార్షిక బడ్జెట్‌కు ఈసీ ఆమోదం లేదు. బడ్జెట్‌ ఆమోదం లేకుండానే వీసీ రూ. కోట్లలో ఖర్చు చేశారు. ఈ ఖర్చులపై ఆడిట్‌ జరుగుతోంది. కానీ ఆడిట్‌లో అక్రమాలు వెలుగులోకి రాకపోవడం యూనివర్సిటీలో చర్చనీయాంశమైంది. ఆడిట్‌ సిబ్బందిని సైతం వీసీ 'మేనేజ్‌' చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నేడు వీసీ ప్రెస్‌మీట్‌

తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్‌ సోమవారం క్యాంపస్‌కు రానున్నారు. ఈ నెల 19న హైదరాబాద్‌లో వర్సిటీ పాలకమండలి(ఈసీ) సమావేశానికి హాజరైన వీసీ, అనంతరం వాకౌట్‌ చేసిన విషయం తెలిసిందే. వీసీ అక్రమాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఈసీ సభ్యులు అతడి అధికారాలకు కత్తెర వేసి నూతన రిజిస్ట్రార్‌గా యాదగిరిని నియమించడంతో పాటు విచారణ కోసం ఐదుగురితో కమి టీని ఏర్పాటు చేశారు. అయితే తాను చైర్మన్‌గా వ్యవహరించే ఈసీ సమావేశంలో కళాశాల వి ద్యా కమిషనర్‌ నవీన్‌మిట్టల్‌ తనను అవమానించారని, తాను లేకుండానే నిర్వహించిన సమావేశంలో తీసుకున్న ఈసీ నిర్ణయాలను రద్దుచేయా లని వీసీ ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే రిజిస్ట్రార్‌గా యాదగిరి బాధ్యత లు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధమని వీసీ పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం క్యాంపస్‌కు వచ్చి ప్రెస్‌మీట్‌ నిర్వహిస్తానని వీసీ సమాచారం ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. అలాగే డెయిలీవేజ్‌ పేరిట తెయూ మూడు క్యాంపస్‌లలో ఈసీ అనుమతి లేకుండా నియమించిన 147 మందిని రిజిస్ట్రార్‌ యాదగిరి బాధ్యతలు స్వీకరించిన వెంటనే రావద్దని ఆదేశించారు. ప్రైవేటు పీఏ ద్వారా తమ వద్ద మామూళ్లు తీసుకుని వీసీ డెయిలీవేజ్‌ కింద పనులు చేయించుకున్నారని ఇప్పుడు అకస్మాత్తుగా తమను రావద్దని అనడంతో తమ పరిస్థితి ఏమిటో తెలియక వారంతా ఆందోళన చెందుతున్నారు. సోమవారం వీసీ రాగానే తాము ఇచ్చిన డబ్బులు వెనక్కి ఇవ్వాలని అడిగేందుకు డెయిలీవేజ్‌ సిబ్బంది సిద్ధమవుతున్నారు.

ఎవరనేది తెలియదు

కార్యాలయంలో రికార్డులు వెతుకుతుంటే శుశ్రుత్‌రెడ్డి అనే వ్యక్తికి రూ. 3,18,500లు చెల్లించినట్లు తేలింది. ఈ విషయమై అకౌంటెంట్‌ను పిలిచి అడిగితే.. వీసీ చెబితే చెక్కులు రాశానని, వాటిపై రిజిస్ట్రార్‌ సంతకం చేయడంతో బ్యాంక్‌ ఖాతాలో జమ చేసినట్లు తెలిపాడు. అసలు శుశ్రుత్‌రెడ్డి అనే వ్యక్తి వర్సిటీలో ఏ విభాగంలోనూ పనిచేయడం లేదు. ఎలాంటి ఆర్డర్‌ లేకుండా ఏడాదిన్నరగా అతడి ఖాతాలో వేతనం పేరిట లక్షల రూపాయలు ఎలా వేశారనే విషయమై విచారణ జరుపుతున్నాం. అలాగే అడ్వాన్స్‌ పేరిట వీసీ పీఏలు తీసుకున్న డబ్బులను 4, 5 రోజులు వర్సిటీ అకౌంట్‌లో వేయాలని వారికి సూచించాం. లేదంటే వారిపై చర్యలు తీసుకుంటాం.

– ప్రొఫెసర్‌ యాదగిరి, రిజిస్ట్రార్‌, తెయూ

పసుపు బోర్డు తేలేని అసమర్థ ఎంపీ అర్వింద్‌

- సీఎం కేసీఆర్‌ అనేక పథకాలు అమలు చేస్తున్నారు
- ఆర్టీసీ చైర్మన్‌ బాజిరెడ్డి గోవర్ధన్‌

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): తనను గెలిపించిన ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని బాండ్‌ పేపర్‌ రాసిచ్చి, తేలేని అసమర్థ ఎంపీ అర్వింద్‌ అని ఆర్టీసీ చైర్మన్‌, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ విమర్శించారు. తండ్రీ కొడుకులిద్దరూ ఎంపీ ల్యాండ్స్‌ నిధులను కమీషన్లకు అమ్ముకున్నారని డీఎస్‌, అర్వింద్‌నుద్దేశించి ఆరోపించారు. ఆదివారం నగర శివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్‌లో రూ. 4.45కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఒలింపిక్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్‌ కార్పొరేషన్‌ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే విలీన గ్రామాలకు నిధులు మంజూరయ్యేవి కాదన్నారు. వారికి ఉత్త మాటలే తప్ప చేతలు ఉండవని ఎద్దేవాచేశారు. రూరల్‌ నియోజక వర్గంలోని విలీన గ్రామాల అభివృద్ధికి రూ. 27 కోట్ల తో పాటు ప్రత్యేకంగా మున్సిపల్‌ శాఖ మంత్రి కేటీఆర్‌ మరో రూ. 10కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఇప్పటికే 5వ డివిజన్‌కు రూ. కోటీ 20లక్షలకు పైగా ఖర్చు చేశామన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన అంటున్నారని, సీఎం పోస్టు నామినేటెడ్‌ కాదని, ప్రజలే ఆయనను గెలిపిస్తున్నారని చురకలంటించారు. సీఎం కేసీఆర్‌ది పూర్తిగా తెలంగాణ అభివృద్ధి ఆకాంక్ష అని, అనేక పథకాలు అమలు చేస్తున్నారని, మహారాష్ట్రలో కూడా బీఆర్‌ఎస్‌ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ సౌజన్య రాజశేఖర్‌రెడ్డి, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌, ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌ సాంబారి మోహన్‌, డీసీసీబీ డైరెక్టర్‌ చంద్రశేఖర్‌రెడ్డి, నుడా డైరెక్టర్‌ అభిలాష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్‌ తదితరులు

పంట నష్టం 45 ఎకరాలు

- ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): జిల్లాలో వరుసగా మూడు రోజుల పాటుగా కురిసిన అకాల వర్షాలకు మొత్తం 45 ఎకరాల్లో 33 శాతానికి మించి పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ లెక్క తేల్చింది. సీఎం కేసీఆర్‌ ఆదేశాలతో కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు క్షేత్రస్థాయి వ్యవసాయాధికారులతో వివరాలను తెప్పించుకున్నారు. అయితే, కేవలం ఇందల్వాయి మండలంలోనే కోత దశకు వచ్చిన వరికి నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ఇందల్వాయితో పాటు గన్నారం గ్రామం కలిపి 62 మంది రైతులకు చెందిన 45 ఎకరాల వరి దెబ్బతిన్నట్లుగా ప్రభుత్వానికి నివేదిక పంపించారు. అయితే, మరికొన్ని మండలాల్లో కూడా వరి, నువ్వు, సజ్జ పంటలు దెబ్బతిన్నప్పటికీ.. 33 శాతానికి లోబడి ఉండడంతో వాటిని వ్యవసాయాధికారులు పరిగణలోకి తీసుకోలేదని తెలిసింది.

నేటి ప్రజావాణి రద్దు

సుభాష్‌నగర్‌: కలెక్టరేట్‌ నేడు సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్‌ బృందం జిల్లా పర్యటనకు రానున్నందున కలెక్టరేట్‌ మీటింగ్‌ హాల్‌లో అధికారులతో సమీక్ష, సెమినార్‌ కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మహిళా కమిషన్‌ పర్యటన దృష్ట్యా ఈ సోమవారం జరగాల్సిన ప్రజావాణిని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఊరికి సర్పంచైనా..



బీడీలు చుడుతున్న ఈమె పేరు ఎర్రం సుష్మిత. డొంకేశ్వర్‌ మండలం చిన్నయానం గ్రామానికి సర్పంచ్‌. సర్పంచ్‌గా ఎన్నికైనప్పటికీ ఒక పక్క బీడీ కార్మికురాలిగా పని చేస్తూనే మరో పక్క కిరాణా షాపు నిర్వహిస్తోంది. గ్రామ సమస్యలను పరిష్కరించడంతో పాటు తాను నమ్ముకున్న వృత్తిని కొనసాగిస్తోంది. పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

– డొంకేశ్వర్‌ (ఆర్మూర్‌)

బిల్లులు రాక.. పరేషాన్‌!

- రూ. 2 కోట్ల వరకు పెండింగ్‌
- చెక్కులు ఇచ్చి రెండున్నర నెలలు
- తలలు పట్టుకుంటున్న కాంట్రాక్టర్లు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ నగర మున్సిపల్‌ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయి. రోడ్లు, డ్రెయినేజీ పనులు పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల బీటీ, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు పూర్తయ్యాయి. కానీ ఇందుకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. రూ. 2 కోట్ల పనుల బిల్లులకు సంబంధించి కాంట్రాక్టర్‌లకు చెక్కులు అందించి రెండున్నర నెలలు గడిచినా చేతికి డబ్బులు రావడం లేదని ఆందోళన చెందుతున్నారు.

కాలపరిమితి ముగిస్తే..

ఒక్క చెక్కు ఇస్తే దాని కాలపరిమితి మూడు నెలలు మాత్రమే ఉంటుంది. మున్సిపల్‌లో సీసీ, బీటీ, డ్రెయినేజీ పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు చెక్కులు ఇచ్చి రెండున్నర నెలలు దాటింది. అయినా చెక్కులను తీసుకుని బ్యాంకులకు వెళితే ఖజానా ఖాళీ అని చూపిస్తోంది. ఏమైనా అంటే డీటీవోలో ఫ్రీజింగ్‌ ఉందని మున్సిపల్‌ అకౌంట్‌ అధికారులు చెప్పి కాలం వెళ్లదీస్తున్నారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. మరో 10 రోజుల్లోగా చెక్కుల కాలపరిమితి దాటిపోతుంది. ఈలోగా డీటీలో నుంచి ఫ్రీజింగ్‌ తీసేస్తేనే చెక్కుల ద్వారా డబ్బులు తీసుకోవచ్చు. లేకుంటే అంతే సంగతులు. తమకు డబ్బులు ఇవ్వకుండా ఇతర పనులు వినియోగిస్తున్నారని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు.

బిల్లులు రాక అప్పులకు పెరుగుతున్న వడ్డీ

సక్రమంగా బిల్లులు రాక వడ్డీలు మరింత పెరిగిపోతున్నాయి. చిన్నచిన్న కాంట్రాక్టులు చేసుకునే చాలా మంది బిల్లులు ఆలస్యమవడంతో పనులు ఆపేశారు. చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లు బిల్లుల ఆలస్యంతో వచ్చే లాభం కాస్తా వడ్డీలకు పోతుందని ఆవేదన చెందుతున్నారు. బిల్లులు త్వరగా ఇవ్వాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

పనులు పూర్తిచేసి ఆరు నెలలు

నిజామాబాద్‌ నగరంలో 60 డివిజన్లు ఉన్నాయి. రూ. 2 కోట్లతో సీసీరోడ్లు, బీటీరోడ్లు, డ్రెయినేజీ పనులను ఆరు నెలల క్రితమే పూర్తి చేశారు. ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ. 10లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. సుమారుగా 20మందికి పైగా కాంట్రాక్టర్‌లు బిల్లుల కోసం మున్సిపల్‌ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పనులు పూర్తి చేసిన తర్వాత కూడా బిల్లులు ఆలస్యం చేయడంపై కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు.

ఫ్రీజింగ్‌ ఉంది

రెండు కోట్ల రూపాయలకు సంబంధించి కాంట్రాక్టర్లకు చెక్కులు ఇవ్వడం జరిగింది. చెక్కులిచ్చి రెండున్నర నెలలు అవుతుంది. డీటీవో ఫ్రీజింగ్‌ ఉండడం వల్ల చెక్కులు పాస్‌ కావడం లేదు. ఒక గడువులోగా రాకుంటే కొత్త చెక్కులు మళ్లీ ఇవ్వడం జరుగుతుంది.

– రమేశ్‌, జూనియర్‌ అకౌంట్‌ ఆఫీసర్‌

పసిప్రాణం తల్లడిల్లుతోంది!

- సాంబార్‌ గిన్నెలో పడిన బాలుడు
- ప్లాస్టిక్‌ సర్జరీకి రూ.50 లక్షలు అవుతుందన్న వైద్యులు
- దాతలు సాయం చేయాలని వేడుకోలు

సుభాష్‌నగర్‌: చిన్నతనంలోనే ప్రమాదవశాత్తు సాంబారు గిన్నెలో పడి శరీరం కాలి పసిప్రాణం తల్లడిల్లుతోంది. అధిక వేడికి మూడేళ్ల బాలుడి చర్మం పూర్తిగా ఊడిపోయి, చేతులు, చెవుల భాగం పూర్తిగా ముద్దలా మారింది. 65శాతం కాలిన గాయాలతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. కళ్ల ఎదుట ప్రాణంతో ఉంటే చాలనుకున్న తల్లిదండ్రులకు కొడుకు మీద ఉన్న ప్రేమానురాగం ముందు బంగారం, ఆస్తిపాస్తులు ఏవీ ఎక్కువ అనిపించలేదు. పగవాడికి కూడా ఈ కష్టం రాకూడదని, ఎప్పటికైనా కొడుకుకు మెరుగైన వైద్యం అందించాలని ఆ తల్లిదండ్రులు పడుతున్న ఆరాటం, బాధలు మాటల్లో చెప్పలేనివి. ప్లాస్టిక్‌ సర్జరీ కోసం వైద్యులు రూ. 50లక్షల వరకు ఖర్చవుతుందని సూచించారు. ఇంత పెద్ద మొత్తం భరించలేని స్థితిలో ఉన్న ఆ తల్లిదండ్రులు దాతల కోసం ఎదురుచూస్తున్నారు.

నగరంలోని వినాయక్‌నగర్‌లో గల ఎస్‌డీసీసీబీ శాఖ బ్యాంక్‌ మేనేజర్‌ శ్రీనివాస్‌, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సంయుక్తకు ఇద్దరు కుమారుల్లో చిన్నకుమారుడు శ్రీ అన్షు. 2020 మే 4న సిద్దిపేట్‌ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమానికి మూడేళ్ల శ్రీ అన్షుతో తల్లిదండ్రులు హాజరయ్యారు. ప్రమాదవశాత్తు ఆడుకుంటూ బాలుడు వేడిగా ఉన్న సాంబారు గిన్నెలో పడిపోయాడు. స్థానికంగా ఉన్న వారు గమనించి వెంటనే బయటకు తీసినా.. అప్పటికే 65శాతం శరీరమంతా గాయాలయ్యాయి. వీపు భాగంతో పాటు చెవులు, చేతి భాగాల్లో చర్మమంతా ఊడిపోగా, శరీరం ముద్దలా మారింది. ఆ సమయంలో కార్పొరేట్‌ ఆస్పత్రిలో రూ. 20లక్షల వరకు ఖర్చు చేసి ప్రాణాలు కాపాడుకోగలిగారు. ఇంట్లో ఉన్న బంగారం, ఆస్తిపాస్తులు అమ్మేశారు. అందరి పిల్లల్లా స్కూల్‌కు వెళ్లి ఆడుకోవాల్సిన కన్న కొడుకు అవిటివాడిలా కళ్లెదుట తిరుగుతుంటే ఆ తల్లిదండ్రులు పడుతున్న బాధ వర్ణించలేనిది. ఆ బాలుడి బాగోగుల బాధ్యత అంతా నానమ్మదే. ఒక్కోసారి శరీరంలో దురద లేస్తే ఆ బాలుడి బాధ వర్ణనాతీతం. రాత్రంతా తల్లిదండ్రులు దగ్గరుండి సపర్యలు చేయాల్సిందే. కొడుకు బాధ చూడలేక ఏడ్వని రోజు లేదంటూ శ్రీనివాస్‌ కన్నీళ్ల పర్యంతమయ్యారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి వైద్య పరీక్షల కోసం ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు. దాతలు 89197 91850 (డి శ్రీనివాస్‌, బాలుడి తండ్రి) నంబర్‌ను సంప్రదించగలరు.



కాలిన గాయాలతో శ్రీ అన్షు

దాతలు ఆదుకోండి..

శ్రీ అన్షుకు ఇప్పటికే ఆస్పత్రిలో రూ. 20లక్షలు ఖర్చయ్యాయి. వీపు, చేతులు ముద్దలా మారి అతుక్కుపోవడంతో హైదరాబాద్‌లోని కిమ్స్‌ ఆస్పత్రిలో మెరుగైన చికిత్సల కోసం సంప్రదించాం. ప్లాస్టిక్‌ సర్జరీ చేయాలని చెప్పారు. అందుకు విడతల వారీగా రూ. 50లక్షల వరకు ఖర్చవుతుందని సూచించారు. అంత మొత్తంలో ఖర్చు చేసి వైద్యం చేయించే స్తోమత లేక దాతల కోసం ఎదురుచూస్తున్నాం.

– శ్రీనివాస్‌, బాలుడి తండ్రి

డీఎల్‌ఎస్‌ఏ ద్వారా ఉచిత న్యాయ సహాయం

- జిల్లా జడ్జి సునీత కుంచాల

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ (డీఎల్‌ఎస్‌ఏ) ద్వారా ప్రజలు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని జిల్లా జడ్జి సునీత కుంచాల తెలిపారు. ఆదివారం డొంకేశ్వర్‌ మండలం అన్నారంలో న్యాయ చైతన్య సదస్సును నిర్వహించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, గృహ హింస వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామాల్లో వీడీసీలు బాధ్యతగా పనిచేసి ప్రజల మెప్పు పొందాలని, సమస్యలకు కారణం కాకూడదని సూచించారు. కార్యక్రమంలో సీనియర్‌ జడ్జిలు నసీమ్‌ సుల్తానా, పద్మావతి, భవ్య, దీప్తి, శ్రీకాంత్‌, సర్పంచ్‌ పోశన్న, పంచాయతీ కార్యదర్శి మానిక, గాదెపల్లి సర్పంచ్‌ భూమేశ్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత

ప్రకృతి అందాలకు జిల్లా జడ్జి ఫిదా!

గోదావరి బ్యాక్‌ వాటర్‌ ప్రాంతాన్ని సందర్శించిన జిల్లా జడ్జి సునీత కుంచాల ప్రకృతి అందాలకు ఫిదా అయ్యారు. ఆదివారం సీనియర్‌ జడ్జిలతో కలిసి డొంకేశ్వర్‌ మండలం జీజీ నడ్కుడకు వచ్చారు. ఈ సందర్భంగా పచ్చదనం పర్చుకున్న బ్యాక్‌ వాటర్‌ ప్రాంతమంతా కలియతిరిగారు. జింకలు, పక్షులను చూసి పరవశించారు. జీపులో కూర్చొని కాసేపు సరదాగా అలా తిరిగొచ్చారు. అనంతరం అందరితో కలిసి అక్కడే టీ తాగారు. కోర్టుల్లో బిజీగా ఉండే తమకు నదీ తీరం ప్రకృతి కనువిందు చేసిందని అభిప్రాయపడ్డారు. వీరి వెంట నందిపేట్‌ ఎస్సై శ్రీకాంత్‌, ఫారెస్ట్‌ డిప్యూటీ రేంజ్‌ ఆఫీసర్‌ సుధాకర్‌, తదితరులున్నారు.



గోదావరి బ్యాక్‌ వాటర్‌ ప్రాంతంలో జిల్లా జడ్జితో సీనియర్‌ జడ్జిలు, అధికారులు, సిబ్బంది

క్లుప్తంగా

బీడీ కార్మికులకు పెరిగిన భత్యం అమలు చేయాలి



కామారెడ్డి రూరల్: బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం వెంటనే అమలు చేయాలని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం డిమాండ్ చేశారు. ఆదివారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్‌లో బీడీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. 1000 బీడీలకు రూ.232.04 పైసలు ఏప్రిల్ నుంచి చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బీడీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఎర్ర సిద్దిరాములు, రజిత, మల్లవ్వ, కళావతి, బాలమణి, నాగలక్ష్మి, రేణుక, స్వరూప, భారతి ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి



బోధన్: అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు సబ్బాని లత ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పట్టణ కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ సారి యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి పంట దిగుబడులు చేతి కొచ్చే సమయంలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాల వల్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ధాన్యం డబ్బులు 2 రోజుల్లో రైతుల ఖాతాలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఎండాకాలం జరపైలం

- వాహనాల టైర్లు పేలే ప్రమాదం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు



మునిపల్లి శివారులో జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన కారు (ఫైల్)

భీమ్‌గల్: జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి శివారులో 63వ జాతీయ రహదారిపై వారం క్రితం రోడ్డు ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం సమయంలో మునిపల్లి శివారు వద్ద కారు టైరు పేలడంతో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు మృతి చెందగా మరొకరికి రెండు కాళ్లు విరిగాయి. ఎండాకాలంలో వాహనాలు టైర్లే పేలి ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వేసవిలో భానుడు భగభగ మండుతున్నాడు. రోజూరోజుకు ఎండలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితితో వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. వేగంగా వెళ్లే సమయంలో వేడికి టైర్లు పేలి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. ఎండకు తారు రోడ్డు బాగా వేడెక్కి టైర్లు మెత్తబడి ట్యూబులతో సహా పేలిపోతాయి. ఈ క్రమంలో వేగంగా వెళ్లే వాహనాలు అదుపుతప్పి బోల్తా పడటంతో అందులోని మృత్యువాత పడుతున్నారు. అంతేకాకుండా వేడికి వాహనాలు దగ్ధమయ్యే అవకాశం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వేసవిలో అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో ప్రయాణాలు చేయొద్దు.
- వాహనాల టైర్లను తరుచూ చెక్ చేసుకోవాలి.
- ప్రయాణానికి ముందు వాహన కండీషన్‌తో పాటు టైర్లలో గాలిని తనిఖీ చేయాలి.
- వాహనానికి ఉన్న జత టైర్ల అరుగుదల సమానంగా ఉండేల చూసుకోవాలి. ఏ ఒక్కటి ఎక్కువ అరిగినా.. మిగితావి బాగున్నా ఎండ వేడికి ప్రమాదం సంబవించే అవకాశం ఉంటుంది.
- ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు ట్యూబుల్లో పరిమితంగా గాలి ఉండాలి. మోతాదుకు మించి ఉంటే ఒత్తిడి పెరిగి పగిలే ప్రమాదముంది.
- అరిగిపోయిన టైర్లతో దూర ప్రాంతాలకు ప్రాయాణించడం, అధిక వేగంతో ప్రయాణించడం వంటివి చేయకూడదు.
- టైర్లు అరిగిపోతే నిర్లక్ష్యం చేయకుండా మార్చుకోవాలి.

అవగాహన తప్పనిసరి



వాహనం నడిపే వారికి వాహన నిర్వాహణ, టైర్ల విషయంలో అవగాహన ఉండాలి. వీల్ అలైన్‌మెంట్ ముఖ్యం. వేసవిలో ఎక్కువ దూరం ప్రయాణం చేయాల్సి వచ్చినప్పుడు మధ్యలో చల్లటి ప్రదేశంలో కొద్దిసేపు ఆగి వాహన సామర్థ్యాన్ని కూడా పరిక్షించుకోవాలి. అతివేగంగా వెళ్లకపోవడం మంచిది.

– మహేందర్, మెకానిక్, భీమ్‌గల్

స్టడీ సెంటర్ ఏర్పాటుకు చేయూత



వడ్ల రమేష్

తాడ్వాయి: మండలంలోని కృష్ణాజీవాడి గ్రామంలో స్టడీ సెంటర్ ఏర్పాటు చేయడానికి అదే గ్రామానికి చెందిన వడ్ల రమేష్ ముందుకు వచ్చారు. హైదరాబాద్‌లో బిజినెస్ చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదిగిన ఆయన తాను పుట్టి పెరిగిన ఊరిలో పేద విద్యార్థుల కోసం స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. మే నెలలో ఈ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్, వసతులను కల్పిస్తారు. కృష్ణాజీవాడి గ్రామానికి చెందిన వారే కాకుండా మండలంలోని ఇతర గ్రామాలకు చెందిన వారు కూడా ఈ స్టడీ సెంటర్‌కు రావచ్చని గ్రామస్తులు తెలిపారు.



కృష్ణాజీవాడిలో ఏర్పాటు చేసే స్టడీ సెంటర్ నమూనా

ఇటుక బట్టీలకు అక్రమంగా మట్టి తరలింపు



ట్రాక్టరులో మట్టి నింపుతున్న జేసీబీ

సిరికొండ: అనుమతి లేకుండా చెరువులో నుంచి నల్లమట్టిని ఇటుక బట్టీలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఆదివారం సెలవు దినం చూసుకొని అధికారుల కన్నుగప్పి బట్టీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రం శివారులోని బసంత్ చెరువులో నుంచి గడ్కోల్ శివారులో గల ఇటుక బట్టీ నిర్వాహకుడు ఆదివారం జేసీబీ ట్రాక్టర్ల ద్వారా వందల ట్రిప్పుల నల్లమట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా తరలించాడు. ఎవరికీ తెలువకుండా ఉండేలా చెరువు శిఖం చివరి భాగంలో నుంచి జేసీబీ ద్వారా మట్టి తవ్వకాలు చేపట్టారు. సిరికొండ–కామారెడ్డి ప్రధాన రహదారి మీదుగా నల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్నప్పటికి రెవెన్యు, నీటిపారుదల శాఖల అధికారులు ఎవరు అడ్డుకోలేకపోవడంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మండల రెవెన్యు ఇన్‌స్పెక్టర్ నాగన్నను సంప్రదించగా మట్టి తరలింపు గురించి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, మట్టి తరలింపును నిలిపి వేయిస్తానని తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల 1983–84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కామారెడ్డి అమృతా గ్రాండ్ హోటల్‌లో జరిగింది. ఇక్కడ చదువుకుని రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు తమ స్నేహితులను కలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. చదువుకున్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చాట్ల చంద్రకాంత్, వెంకటేష్, వంశీకృష్ణాగౌడ్, దామోదర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పాక వెంకటి, బుజ్జి లక్ష్మీనారాయణ, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల 1983-84 బ్యాచ్ విద్యార్థులు

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



మోర్తాడ్: రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడటానికి అవకాశం ఉందని రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ బుస్సా ఆంజనేయులు అన్నారు. ఆదివారం మోర్తాడ్‌లోని సంత్ నిరంకారీ సత్సంగ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 45 మంది తమ రక్తదానం చేశారు. వారిని జిల్లా చైర్మన్ ఆంజనేయులు అభినందించారు. సంస్థ వైస్ చైర్మన్ దొల్ల రాజేశ్వర్, మండల చైర్మన్ జైడి గంగారెడ్డి, కమ్మర్‌పల్లి చైర్మన్ మహేష్, సత్సంగ్ ప్రతినిధి రాందాస్ పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్టు

గాంధారి: భార్యపై హత్యాయత్నం చేసిన నిందితుడిని అరెస్టు చేసి ఆదివారం రిమాండ్ చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని పిప్కిల్‌గుట్ట తండాకు చెందిన మమతను రెండేళ్ల క్రితం నేరల్ తండాకు చెందిన దరావత్ రాంసింగ్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. రాంసింగ్ నిత్యం మద్యం తాగి భార్యను అనుమానిస్తూ హింసించేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి భార్యతో గొడవ పడి ఇంట్లో ఉన్న మటన్ నరికే కత్తితో చంపడానికి యత్నించగా మమత తప్పించుకుని పరుగులు తీసింది. దీంతో గమనించిన తండావాసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తండాకు చెందిన రవీందర్‌కు గాయాలు అయ్యాయి. మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు.

అన్యమత ప్రచారం చేస్తున్నారని దాడి

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- నలుగురిపై అట్రాసిటీ కేసు



పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన బాధితులు

బిచ్కుంద: అన్యమత ప్రచారం చేస్తున్నారని కొందరు యువకులు పాస్టర్లపై దాడి చేశారు. మండలంలోని పుల్కల్‌లో బొట్టు శిరీష ఇంట్లో శనివారం రాత్రి శుభకార్యంలో ప్రార్థనలు చేస్తుండగా పుల్కల్‌కు చెందిన ముగ్గురు, వాజిద్‌నగర్‌కు చెందిన ఒకరు శిరీష ఇంటికి వెళ్లి అన్యమత ప్రచారం చేస్తున్నారని వారిని దూషించి దాడికి పాల్పడ్డారు. మత ప్రచారం చేసుకోవడం లేదని, శుభకార్యం చేసుకొని కుటుంబ సభ్యులు, పాస్టర్లతో ప్రార్థనలు చేసుకుంటున్నామని వేడుకున్నా వినకుండా కులం పేరుతో దూషించి దాడి చేశారని బాధితులు ఆరోపించారు. పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే పుల్కల్ చేరుకొని దాడి చేసిన యువకులను అదుపులోకి తీసుకున్నారు. అన్యమత ప్రచారం చేయకున్నా చేసినట్లు దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతు బాధితులు, దళిత సంఘం నాయకులు స్టేషన్‌కు తరలివచ్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు గన్న సంతోష్‌రెడ్డి, జగడం సాయికుమార్, మొండికార్ సాయికుమార్, వాజిద్‌నగర్‌కు చెందిన బండి సాయిలుపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

రెండు సెల్‌ఫోన్ల చోరీ

భిక్కనూరు: భిక్కనూరు ఆదివారం జరిగిన వారసంతలో రెండు సెల్‌ఫోన్లు చోరీ అయ్యాయి. సంతలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారిలో ఇద్దరూ తమ సెల్‌పోన్లన పాగొట్టుకున్నారు. సంతలో సెల్‌ఫోన్ల చోరీ అధికం అవుతుండడంతో నాలుగు వారాలుగా పోలీస్‌లు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ అనుమానితులను తనిఖీ చేస్తున్నారు. అయినా ఆదివారం ఇద్దరి సెల్‌ఫోన్లను దొంగలు ఎత్తుకెళ్లారు.

క్రైం కార్నర్

పాముకాటుతో చిన్నారి మృతి



ఉదయ్‌కుమార్(ఫైల్)

లింగంపేట: మండలంలోని భవానిపేట పంచాయతీ బామనమ్మ తండాకు చెందిన దండుగుల ఉదయ్‌కుమార్(7) ఆదివారం పాము కాటులో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. భవానిపేటకు చెందిన దండుగుల రమేష్ రజితలకు ఇద్దరు కుమారులు ఉదయ్‌కుమార్, మాన్విక్‌కుమార్ ఉన్నారు. ఉదయ్‌కుమార్ భవానిపేట ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. సెలవులు కావడంతో అమ్మమ్మగారి ఊరు అడవిలింగాలకు వెళ్లారు. ఇంట్లో తలుపులకు గడియ(బేడమ్) పెట్టే సందులో నాగుపాము ఉంది. ఆడుకుంటూ తలుపు పెట్టడానికి ప్రయత్నించిన చిన్నారి ఉదయ్‌కుమార్‌ను నాగుపాము కాటు వేసింది. ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు..



ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, గ్రామస్తులు



సాయిలు (ఫైల్)

వర్ని: బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో పాతవర్ని గ్రామానికి చెందిన లోకుల సాయిలు(40) ఆదివారం మృతి చెందాడు. మండల కేంద్రంలో పని ముగించుకుని పాత వర్ని గ్రామానికి ద్విచక్ర వాహనంపై సాయిలు వెళ్తుండగా లారీ వెనక నుంచి ఢీకొంది. విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు ఘటన స్థలానికి వచ్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. లారీ యజమాని సాయిలు కుటుంబాన్ని ఆదుకోవాలని రాస్తారోకో చేశారు. పోలీసులు ఎంత చెప్పినా న్యాయం జరిగే వరకూ ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. చివరకు బాధిత కుటుంబానికి పరిహారం అందించడానికి లారీ యజమాని ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు.

పోలీసుల అదుపులో చైన్ స్నాచర్లు!

రెంజల్: మండలంలోని సాటాపూర్‌లో శనివారం సాయంత్రం చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు యువకులను పట్టుకుని స్థానికులు చితకబాదారు. బోధన్ మండలం పెగడాపల్లి గ్రామానికి చెందిన మహిళ సాటాపూర్‌లో వారాంతపు సంతకు వచ్చి తిరిగి వెళ్తుండగా గ్రామ శివారులో చైన్‌స్నాచింగ్‌కు ప్రయత్నించినట్లు తెలిసింది. మహిళ వెంటనే తేరుకుని అరుపులు వేయడంతో స్థానికులు, చుట్టుపక్కల వారు చేరుకుని పరారీ అవుతున్న యువకులను పట్టుకుని అక్కడే చితకబాది వివరాలను తెలుసుకున్నారు. ఎడపల్లికి చెందిన యువకులుగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు చేరుకుని యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై రెంజల్ ఎస్సై సాయన్నను వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాపర్ వైర్ చోరీకి యత్నం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో వెంకటేశ్వర గార్డెన్ వెనక గల 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరు చోరీ చేయడానికి శనివారం రాత్రి దొంగలు యత్నించారు. ట్రాన్స్‌ఫార్మర్ కిందకి తోసేసి ఆయిల్ తొలగించారు. ఆ తర్వాత రాగిని దొంగలించేందుకు ప్రయత్నం చేయగా బోల్టులు తెరుచుకోకపోవడంతో పారిపోయినట్లు పెర్కిట్ ఏడీఈ రాజేశ్వర్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

లింగంపేట: మండలంలోని బాణాపూర్ గ్రామానికి చెందిన నవనీత(26) అదృశ్యమైనట్లు ఎస్సై శంకర్ తెలిపారు. నవనీతకు 2014లో బాణాపూర్‌కు చెందిన డప్పు సాయిలుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి తరుచూ గొడవ పడుతున్నారు. మార్చి 14న భర్త సాయిలుతో గొడవ పడి నవనీత ఇంట్లో నుంచి ఇద్దరు కొడుకులను తీసుకొని వెళ్లిపోయింది. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో నవనీత తండ్రి కాట్రాల నర్సింలు లింగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బురద పడటంతో గొడవ.. యువకుడి హత్య

- మాట్లాడటానికి వెళ్తే.. కత్తితో పొడిచి చంపిన వైనం
- నిజామాబాద్‌లో ఘటన



అర్బాజ్‌ఖాన్(ఫైల్)

ఖలీల్‌వాడి: రంజాన్ పండగ రోజు బురద చిల్లించడంతో జరిగిన గొడవ.. ఓ యువకుడి హత్యకు దారి తీసింది. ఈ ఘటన ఆదివారం నగరంలోని ఐదో పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాబాన్ సాహెబ్ పహాడ్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. రంజాన్ రోజు బాబాన్ సాహెబ్ పహాడ్‌కు చెందిన హాజీ తన స్నేహితులతో కారులో వెళ్లే సమయంలో బైక్‌పై వెళ్తున్న వినాయక్‌నగర్‌కు చెందిన మహ్మద్ అర్బాజ్‌ఖాన్‌పై బురద చిల్లించాడు. దీంతో శనివారం వీరి మధ్య గొడవ జరిగింది. ఇరు వర్గాలను అక్కడ ఉన్న వారు సర్ది చెప్పి పంపించారు. ఈ విషయమై కాంప్రమైజ్ కోసం అర్బాజ్‌ఖాన్(18), బాబాన్ సాహెబ్ పహాడ్‌కు చెందిన అజర్, రాజ్, పర్వేజ్, అదిల్‌ను అదే కాలనీకి చెందిన సర్ఫరాజ్, హుస్సేన్, సోహెల్‌మీర్జా, సమీర్, హాజీ, షౌకత్, చిల్లీ పిలిచారు. ఆదివారం ఈ విషయమై మాట్లాడాటానికి వెళ్లి న అర్బాన్‌ఖాన్, అజర్ తోపాటు మరో ముగ్గురికి ప్రత్యర్థి గ్యాంగ్‌తో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కొంత సేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రెండు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాట డిప్యూటీ మేయర్ వెంచర్ నుంచి సూపర్ మార్కెట్ వరకు జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలో సర్ఫరాజ్ తన వద్ద ఉన్న కత్తిని సోహెల్‌మీర్జాకు అందించగా ఆయ న ఆ కత్తితో అర్బాజ్‌ఖాన్‌ను కడుపులో పొడిచాడు. దీంతో అర్బాజ్‌ఖాన్‌కు తీవ్ర రక్త స్రావమైంది. అతడి పక్కన ఉన్న అజర్‌పై కత్తితో పొడవడానికి యత్నించగా చెంపకు గాయమైంది. అర్బాజ్‌ఖాన్, అజర్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అర్బాజ్‌ఖాన్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. యువకుడి హత్య నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బాబాన్‌సాహెబ్‌పహాడ్ ప్రాంతంలో బందోబస్తు నిర్వహించారు. ఘటన స్థలాన్ని నార్త్ సీఐ నరహరి, సౌత్ సీఐ మధుసూదన్‌రావు, ఎస్సైలు సాయినాథ్, సాయికుమార్‌గౌడ్ పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించింది. మృతుడి తల్లి ఆసియా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయినాథ్ తెలిపారు. నాలుగు నెలల క్రితమే రౌడీ షీటర్ ఇబ్రహీం ఛావుస్ హత్య మరువకముందే ఈ ఘటన చోటు చేసుకోవడంతో అక్కడి వారు భయాందోళనకు గురవుతున్నారు. రౌడీషీటర్ల మధ్య ఆధిపోత్య పోరు హత్యలకు దారి తీస్తోందని స్థానికులు అంటున్నారు.

ప్రేమ పెళ్లి.. వేధింపులకు బలి

- వరకట్నం కోసం అత్తింటి వారి వేధింపులు
- ఆత్మహత్య చేసుకున్న యువతి



భార్గవి (ఫైల్)

మోర్తాడ్: నిన్ను ప్రేమిస్తున్నా.. నీతోనే జీవితాంతం కలిసి ఉంటానని బాస చేసిన వ్యక్తిని నమ్మి తన ఇంటివారిని ఎదిరించి ప్రేమ పెళ్లి చేసుకున్న యువతి అత్తారింటికి వెళ్లిన తరువాత వరకట్న వేధింపులు తప్పలేవు. తాను కోరిన డబ్బులు తెస్తేనే ఇంట్లో అడుగుపెట్టనిస్తా లేదంటే పుట్టింట్లోనే ఉండిపో అని భర్త తెగేసి చెప్పడంతో మరణమే శరణ్యం అనుకొని పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్‌కు చెందిన భార్గవి(24). ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వరకట్నం వేధింపులకు బలైన యువతి ఘటనా వివరాలు ఇలా ఉన్నాయి. కోన సముందర్‌కు చెందిన కండె చిన్న బాబు, రాజు మూడో సంతానమైన భార్గవికి 2018లో కరీంనగర్ పట్టణం గౌతమినగర్‌కు చెందిన రాజు అలియాస్ సునీల్‌తో ప్రేమ వివాహం జరిగింది. భార్గవి కుటుంబ సభ్యులు ఈ పెళ్లికి అంగీకరించక పోయినా మేజర్ కావడంతో ఆమె నిర్ణయమే చెల్లింది. పెళ్లి జరిగిన నుంచి కొంత కాలంగా బాగానే ఉన్న భార్గవి రాజుల సంసార జీవితంలో వరకట్నం కుంపటి పెట్టింది. మృతురాలి అత్త శాంత, ఆడపడుచు సోనిల సపోర్టుతో భార్గవి భర్త రాజు వరకట్నం కోసం వేధించగా ఆమె ఆరు నెలలుగా పుట్టింట్లోనే ఉండిపోయింది. తాను మరో పెళ్లి చేసుకుంటున్నానని రాజు ఫోన్‌లో చెప్పడంతో అడ్డుకోవడానికి భార్గవి ఒంటరిగా ఈనెల 20న కరీంనగర్‌కు వెళ్లింది. అక్కడ తన భర్త రాజును కలుసుకున్న తరువాత ఏమి జరిగిందో తెలియదు కాని భార్గవి పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఆమె కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు. ఇక్కడ ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి భార్గవి తుదిశ్వాస విడిచింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: గంజాయి అమ్ముతున్న ముగ్గురు అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఏసీపీ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరంలోని సుభాష్‌నగర్‌లోని రైతుబజార్‌కు చెందిన దుగురు ఈశ్వర్(20), ఎల్లమ్మగుట్టకు చెందిన లక్కా శశాంక్(24), ఆర్యనగర్‌లోని బదావత్ ప్రమోద్(19), బాలు, తరుణ్ కొన్ని రోజులుగా నగరంలో గంజాయి అమ్ముతున్నారు. ఈ నెల 21న నగరంలోని అమ్మనగర్ వెంచర్‌లో గంజాయి అమ్ముతున్న వీరిని పట్టుకోడానికి యత్నించగా ఈశ్వర్, శశాంక్, ప్రమోద్ దొరికారన్నారు. మరో ఇద్దరు పరారైనట్లు చెప్పారు. వీరి నుంచి 11 గంజాయి ప్యాకెట్లు, రెండు సెల్‌ఫోన్లు, రెండు మోటర్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఐదుగురు నిందితులు జల్సాలకు అలవాటు పడి ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో నాందేడ్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి నిజామాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో అధిక ధరకు అమ్ముతున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న టౌన్ సీఐ వెంకటనారాయణ, ఎస్సై సందీప్, పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

అత్తింటివారి వేధింపులతో వివాహిత ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

లింగంపేట: లింగంపేటలోని మత్తడికిందిపల్లెకు చెందిన వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు.. తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన గోసంగి కాలవ్వ, సాయిలుకు ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. పెద్ద కూతురు శృతి రాణి(21)ని రెండున్నర ఏళ్ల క్రితం లింగంపేట మండల కేంద్రం మత్తడికిందిపల్లెకు చెందిన టేకు సాయిలుకు ఇచ్చి పెళ్లి చేశారు. పెళ్లయిన ఏడాది నుంచి పని చేయడం లేదని భర్త సాయిలు, అత్త జానవ్వ, మామ పెద్ద సాయిలు శృతిరాణికి వేధించేవారు. ఈ విషయమై పెద్దల సమక్షంలో మాట్లాడి నచ్చజెప్పి పంపారు. రెండు నెలల నుంచి మళ్లీ వేధింపులకు గురిచేస్తున్నారని ఈ నెల 21న తండ్రికి ఫోన్ చేసి శృతిరాణి చెప్పింది. తనకు ఆరోగ్యం బాగాలేదని కొద్ది రోజుల అయ్యాక తీసుకెళ్తానని ఆయన చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన శృతిరాణి 21న మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కామారెడ్డికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాదు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. తన కూతురు మరణానికి భర్త అత్తమామల వేధింపులే కారణమని సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

- భార్య హతమార్చి ఉంటుందని గ్రామస్తుల ఆరోపణ



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాజంపేట: అనుమానాస్పద రీతిలో ఒకరు మృతి చెందిన ఘటన రాజంపేటలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గంగు లింగం శుక్రవారం నుంచి కనిపించడం లేదని భార్య లావణ్య శనివారం ఫిర్యాదు చేసింది. ఆదివారం ఆమె కాలనీవాసులు, బంధువులతో కలిసి ఉదయం 8 గంటల ప్రాంతంలో గ్రామ శివారులో వెతకగా సిద్దుల గుట్ట ప్రాంతంలో లింగం మృతదేహం కనిపించింది. దీంతో పోలీసుల సమచారం అందించగా ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సైతం భారీ ఎత్తున ఘటనా స్థలానికి చేరుకున్నారు. లింగం హత్యకు గురైనట్లు గుర్తించిన పోలీసుల క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో వివరాలు సేకరించారు. లింగం హత్యకు భార్య లావణ్యనే కారణమై ఉంటుందని గ్రామస్తులు, బంధువులు ఆరోపించారు. ఆమెను విచారించి శిక్షించే వరకు మృతదేహాన్ని తరలించేది లేదని వాదించారు. దీంతో పోలీసులు లింగం భార్య లావణ్యను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.